కంచె తుంచేస్తున్నారు..

- మునసర్లోవ వద్ద ఫెన్సింగ్‌లో ఇనుప రాడ్లు మాయం
- పట్టుకుపోతున్న గుర్తు తెలియని వ్యక్తులు



ముడసర్లోవ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన కంచెలో తొలగించిన ఇనుప రాడ్లు

ఆరిలోవ: ఖాళీ స్థలాలకు రక్షణ కల్పించడంలో భాగంగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన కంచెను గుర్తు తెలియని వ్యక్తులు తుంచేస్తున్నారు. అధికారులు లక్షల రూపాయలు ఖర్చుచేసి ఫెన్సింగ్ వేస్తుంటే.. కొందరు వాటిని తొలగించి జల్సా చేసుకుంటున్నారు. ముడసర్లోవ వద్ద స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నుంచి ముడసర్లోవ పార్కు మీదుగా రిజర్వాయర్ చివరి వరకు గతంలో జీవీఎంసీ ఇనుప రాడ్లు పాతి, వాటికి ఇనుప తివ్వలు చుట్టి కంచె ఏర్పాటు చేసింది. ఇటీవల ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీకి సంబంధించిన భూములు ఆక్రమణకు గురికాకుండా ఆ కంచెకు బదులుగా అధికారులు పక్కా రక్షణ గోడలు నిర్మించారు. ఈ గోడ బీఆర్టీఎస్ రోడ్డు వైపు ముడసర్లోవ పార్కు వరకు నిర్మించి వదిలేశారు. ఇంకా కొన్ని చోట్ల రక్షణ గోడ నిర్మించాల్సి ఉంది. ఆ ప్రదేశాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు, తీగలతో కూడిన కంచే రక్షణగా ఉంది. దానిని గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిళ్లు తొలగించి రాడ్లు పట్టుకుపోతున్నారు. కొద్ది రోజులుగా ఇక్కడ కంచె తొలగించి ఇనుప రాడ్లు పట్టుకుపోతున్నా.. అధికారులు గమనించడం లేదా మనకెందుకులే అంటూ వదిలేస్తున్నారో అని అటుగా వెళ్తున్న వాకర్స్, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కంచె లేకపోతే ఇక్కడ స్థలాలు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఆరిలోవలో తుక్కు దుకాణాలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ ఇనుప రాడ్లు తొలగించి వాటిని ఆయా దుకాణాల్లో విక్రయించేస్తున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

20ఏ బస్ సర్వీసును పునరుద్ధరించండి



వార్వా, నివాస్ ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతినిధులు

మద్దిలపాలెం: గతంలో హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్టాప్ వరకూ తిరిగే 20ఏ బస్సును పునరుద్ధరించాలంటూ వార్వా, నివాస్, హెచ్‌బీకాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం హెచ్‌బీ కాలనీ వద్ద నిరసన చేపట్టారు. కరోనా సమయంలో ఈ బస్సు సర్వీసును రద్దు చేసి, కరోనా ముగిసినా పునరుద్ధరించకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. ఈ బస్సు సర్వీసు పాత పోస్టాఫీస్ నుంచి జగదాంబ, పూర్ణామార్కెట్, డాబాగార్డెన్స్ మీదుగా తమ కాలనీకి వచ్చేదన్నారు. ఇపుడు ఈ సర్వీసు లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో జగదాంబకు రూ.10 టిక్కెట్‌తో వెళ్తే, ఇపుడు రూ.40 వెచ్చించాల్సి వస్తోందన్నారు. దీనిపై ఇప్పటికే ఆర్టీసీ ఆర్‌ఎంకు వినతి పత్రం అందించినా, పట్టించుకోకపోవడంతో నిరసనకు దిగినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.రమాప్రభ, నరవ ప్రకాశరావు, వార్వా కార్యదర్శి బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మనోహర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అప్పారి గిరిబాబు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డిని ఆదివారం జోన్–3 మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు ఆయనకు అప్పారి కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

సాగర తీరం పరిశుభ్రం



సాగర తీరంలో చెత్త సేకరిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: సాగర తీరంలో పేరుకుపోయిన చెత్తను సెయింట్ అలోసియస్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం తొలగించారు. అనంతరం ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మరియదాస్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్వారకా స్టేషన్‌లో ఎస్‌ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ రౌడీ షీటర్లకు పలు సూచనలిచ్చారు. సత్ప్రవర్తనతో ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం షాపుల వద్ద చేరి గొడవలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద పోలీసులు, సిబ్బంది అప్పగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు

కొమ్మాది/పీఎం పాలెం: పీఎం పాలెం శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ సాయి కళానికేతన్ కూచిపూడి నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా గణపతి పాట, దశావతారం, శివ తాండవం, సీతా కల్యాణం నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వర దివ్యక్షేత్రం సాంస్కృతిక కార్యక్రమాల వేదిక వద్ద నిర్వహించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



తోటగరువులో పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆప్‌కాస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు

ఆరిలోవ : ప్రపంచ పర్యావణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో తోటగరువులో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ వేసవి క్రీడా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, ఆప్‌కాస్ట్ సభ్యులు కలసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తోటగరువు కూడలి వరకు పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ, ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆప్‌కాస్ట్ జిల్లా సమన్వయాధికారి పి.రాజారావు మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజలకు అవగాన పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాలుష్యం వల్ల పర్యావరణం నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించగలిగితే పర్యావరణాన్ని పరిరక్షించినట్లేనని పేర్కొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు క్రీడాంశాలు నేర్పించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభిరుచులు, వారి ఆశయాలను తెలుసుకోవడానికి ఇటువంటి శిబిరాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సచివాయల సిబ్బంది, జీవీఎంసీ స్పోర్ట్స్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

‘తిల్లానాలు’పై సంగీత శిక్షణ



వంకాయల వెంకటరమణమూర్తిని సత్కరిస్తున్న మండపాక శారద

సీతంపేట: పద్మ విభూషణ్, సంగీత కళానిధి డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచించిన తిల్లానాలుపై విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంగీత శిక్షణ శిబిరం జరిగింది.

అహిర్ భైరవి, కుంత వరాళి, కదన కుతూహలం, బేహాగ్ రాగాల్లో తిల్లానాలు నేర్పారు. మృదంగ విద్వాంసుడు వంకాయల వెంకటరమణమూర్తికి బెనారస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా అకాడమీ తరపున ఆయనను శారద సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవాధ్యక్షుడు ఎం.ఎస్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ నాగలక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న చిన్నారులు

బీచ్‌రోడ్డు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మహేశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూత్ హాస్టల్స్ ఇండియా, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా ఆదివారం డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు స్వచ్ఛందంగా నిషేధించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా యూత్ హాస్టల్స్ ప్రాంతంలో మొక్కలను నాటారు. అనంతరం డ్రాయింగ్ విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ ఇండియా విశాఖ అధ్యక్షుడు ఎ.పుండరీకాక్ష, ప్రతినిధులు మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన రూ.20 లక్షలతో 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావులు ఆదివారం కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి, సచివాలయాల వారీ అభివృద్ధికి నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఈ నిధులతో ప్రాధాన్యతా పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు నాగేశ్వరరావు, పోల రత్నం, మీసాల ప్రదీప్, బొట్టా గణేష్, పల్లా త్రినాథ్, ఏఈ రెహమాన్‌లు పాల్గొన్నారు.

రైలు ప్రమాదం బాధాకరం



మూలా వెంకటరావు

మద్దిలపాలెం: ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదం బాధాకరమని ఏపీ స్టేట్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు పరిహారం కింద రూ.25 లక్షలు చెల్లించి, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం నైతికంగా బాధ్యత వహించి బాధితులను ఆదుకోవాలని కోరారు.

సేవా సైనికులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పాన్ని నెరవేర్చే సేవా సైనికులుగా వలంటీర్లు ఖ్యాతీ సంపాదించారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో వలంటీర్ల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె వలంటీర్లను సేవా పురస్కారాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అనేక సేవలందిస్తున్న వలంటీర్ల పనితీరును ప్రశంసించారు. ప్రభుత్వ ఆశయాల సాధనకు వారంతా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీడీ దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, పోలరత్నం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న స్థానికులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ అంజయ్య నగర్, మూలపాలెం ప్రాంతాల్లో స్థానికులు తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండటంతో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు స్పందించారు. సమస్యను జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయించారు. దీంతో స్థానికులు ఆదివారం తాగునీరు పట్టుకుని అవసరాలు తీర్చుకున్నారు. నీటి సమస్య ఉన్న నేపథ్యంలో రోజూ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కల్యాణ్, కనకరాజు, ప్రసాద్, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగం



సీతారామచంద్రస్వామి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో గత నెల 30 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున సాయంత్రం 6 గంటలకు స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు, సర్వలోప ప్రాయశ్చితం నిర్వహించారు. అనంతరం శ్రీపుష్పయాగం, పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు




రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్ పర్యవేక్షించారు. మండుటెండలకు భక్తులు అవస్థలు పడ్డారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు ప్రత్యేక టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేకువ జాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

దశ మహావిద్యలపై అనుగ్రహ భాషణం





హాజరైన భక్తులు, అనుగ్రహ భాషణం చేస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శ్రీ దశ మహావిద్యలపై అనుగ్రహ భాషణ కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. కుర్తాళం శంకరాచార్యులు, లలితా పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి తొలి రోజు దశ విద్యల్లో దేవతైన లలితాదేవి గురించి అనుగ్రణ భాషణం చేశారు. లలితాదేవి విశిష్టతను, వైభవాన్ని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి ప్రవచనాలు శ్రద్ధగా విన్నారు.

ఈ నెల 8 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామి వారి అనుగ్రహ భాషణం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కోరారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

అణగదొక్కే ప్రయత్నం మానుకోవాలి

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను అణగదొక్కే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 843వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్రం ఉపసంహరించుకున్నట్లు ప్రకటన చేయాలని, లేని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి అమలు కావడానికి ముడిసరకుల నిల్వలు పెంచాలని, కార్మిక వర్గానికి నూతన వేతన సవరణ ప్రకారం జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు, ఇతర కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తుల నివాళి



అక్కయ్యపాలెంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సమయం హేమంత్ కుమార్, విద్యార్థులు

సీతంపేట: ఏపీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం కూడలిలో ఒడిశా రైలు ప్రమాదం ఘటనలో మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన రాష్ట్ర ప్రజలకు కేంద్ర సహాయ నిధితోపాటు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భారీ గాయాలు, అవయవాలు కోల్పోయిన వారి కుటుంబాలను జీవితాంతం ఆదుకునేలా కుటుంబ సభ్యులకు రైల్వేలో ఉద్యోగం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల న్యాయవాది పలకా శ్రీరామమూర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలుకు నివాళి



ఎస్పీ బాలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు, రాజశేఖర్,

మద్రిపాలెం: మెలోడి క్రియేటర్స్, కాలనీ కేర్ టీం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వన విహార్ పార్కులో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు విగ్రహానికి ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు చలనచిత్ర సీమ ద్వారా తన మధుర గానంతో బాలు చేసిన గాత్ర సేవలను వీసీ రాజు కొనియాడారు. దేశం గర్వించే గొప్ప గాయకుడు కీర్తిని పొందడమే కాకుండా తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ కదలి సారథ్యం వహించిన ఈ కార్యక్రమంలో మెలోడి క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్, కళాకారులు పాల్గొన్నారు.